# Father's Day Special

## మురిపెమంతా మరుగునే...



సర్వసాధారణంగా అందరికీ తండ్రి అంటే ఎంతో కొంత భయం ఉంటుంది. అలాగే తాము చేసే మంచి పనులను కూడా తండ్రి మెచ్చుకోవటం లేదని, పైగా కసురుకుంటున్నాడని, చాలా మందికి ఒక నిశ్చిత అభిప్రాయం ఉంది. ఇదే విధమైన ఫిర్యాదులను బాల్యదశలో వారు అమ్మకి చేస్తారు. వయసు పెరుగుతున్న కొద్దీ వారికి తండ్రి మీద కోపం ఎక్కువై పోతుంది. తండ్రిని ఒక శత్రువులా చూడటం ప్రారంభిస్తారు. అయితే వాస్తవానికి ఆ తండ్రికి ఈ కొడుకు మీద ఎలాంటి కోపం, ద్వేషం ఉండవు. ప్రేమ తప్ప!

అలాంటిది మరి కొడుకు మంచి పనులు చేసినా ఎందుకని మెచ్చుకోవడం లేదా? అదేనా మీ సందేహం. ఇందుకు మనం ఒక గొప్ప వ్యక్తి గురించి క్లుప్తంగా తెలుసుకుంటే తండ్రి ప్రవర్తనకి కారణం, అనవసరంగా తండ్రిని నిందించక ఆ కొడుకు అందుకునే శిక్ష మనకి తెలుస్తాయి.

పూర్వం భారవి అనే కవి ఉండేవారు. బాల్యం నుంచీ అతను ఎన్నో కవితలు రాశారు. పది మంది చేత 'భళా' అనిపించుకున్నారే గానీ, ఏనాడూ విమర్శలు ఎదుర్కోలేదు. అయితే భారవి తండ్రి మాత్రం అతనిని ఏనాడూ మెచ్చుకోలేదు సరి కదా, ఇదేం కవిత్వం నాయనా అనేవాడట. ఇదే విషయం ఎన్నోసార్లు భారవి తన తల్లికి ఫిర్యాదు చేసే వారట. అయితే ఆ తల్లి మాత్రం 'నాయనా! మీ నాయన చాలా మంచి వారు. నీ మేలు కోరేవారేకానీ, ఏనాడూ హాని జరగాలని ఆశించే వారు కాదు. ఆయన నీ కన్నతండ్రి - బాబూ' అంటూ సముదాయించేది. అలా రోజులు గడుస్తుండగా భారవికి తండ్రి మీద కోపం ఎక్కువై పోసాగింది. చివరికి అవి ఎంతవరకూ వెళ్ళిందంటే తండ్రిని అంతం చేయాలన్నంత కోపం భారవిలో కలిగింది.

వెంటనే అతడు వంట ఇంట్లో అటకెక్కి పెద్ద బండరాయి పట్టుకొని కూర్చున్నాడు. తండ్రి ఎలాగూ భోజనానికి వస్తాడు. అప్పుడు ఆ బండరాయిని అతనిపై వేయాలన్నది భారవి ఉద్దేశం. సమయానికి భారవి భార్య కూడా ఇంటలేక పోవడం అతనిని నివారించే వారు లేక పోయారు. తల్లికి కొడుకు అటక పైన కుయుక్తి పన్నాడని తెలీదు. అంతా భారవికి అనుకూలంగా ఉంది.

ఇంతలో భారవి తండ్రి బయట నుంచి వచ్చి, కాళ్లు కడుక్కుని భోజనానికి కూర్చున్నాడు. అవకాశం ఎప్పుడు వస్తుందా బండరాయిని తండ్రిపైకి దొర్లించే అవకాశం కోసం చూస్తున్న భారవికి తల్లితండ్రులు తన గురించే మాట్లాడుకుంటున్నట్టు వినిపించి, వారి మాటలన్ని శ్రద్ధగా వినసాగాడు....

భారతి తల్లి, 'ఏమండీ! భారవి చాలా బాధపడుతున్నాడండీ! వాడ్ని, వాడి రచనలను అందరూ పొగుడుతూ ఉంటే మీరు మాత్రం ఏం మాట్లాడకపోగా, వాడి గురించి చాలా నిరాసక్తి ఉంటారెందుకు? పైగా వాడంటే మీకు కాస్త చిరాకు కూడా ప్రదర్శిస్తున్నారు" అంటుంది.

దానికి భారవి తండ్రి ఓ చిరునవ్వు నవ్వి, 'పిచ్చిదానా! ఇన్నేళ్ల మన సంసారంలో, ఇంతేనా నువ్వు నన్ను అర్థం చేసుకొన్నది. పైగా పది మందీ ఆలోచించిన విధంగానే నువ్వు ఆలోచించడం నాకు నవ్వు తెప్పిస్తోంది. పోనీలే కొడుకు పై ప్రేమ నీ చేత అలా పలికిస్తోందనుకుంటాను.' అన్నారు.

తల్లీ! బావుంది వరస! నాకేనా ప్రేమ? తండ్రిగా మీకు లేదా ఏమిటి? చోద్యం కాకపోతే! అప్పుడు భారవి తండ్రి సమాధానం ఇస్తూ.... "చూడూ... పిల్లలపై ఏ తల్లిదండ్రులకైనా ప్రేమ ఉంటుంది. అది ఎవరూ కాదనలేని నిజం. కానీ ఒక విషయం గుర్తుంచుకో.... భారవి... నా ప్రాణం. వాడి రచనలు నన్ను ఎంతో కదిలించాయి. వాణ్ణి నలుగురూ పొగుడుతూ ఉంటే నా కళ్లు చెమర్చాయంటే నమ్ము. వీడు భవిష్యత్తులో, "చరిత్రలో నిలిచిపోయే రచనలు" చేస్తాడన్నది నా దృఢవిశ్వాసం. వాడికున్న విద్వత్తుకు నేను ఎంతో గర్విస్తున్నాను. కానీ... చూడు ఒక్క విషయం. ఇది నువ్వు కూడా తెలుసుకోవాలి. పిల్లల మేధను తల్లి తండ్రి గుర్తించాలి, ప్రోత్సహించాలి. కానీ వారిని, వారి ముందే పొగడ రాదు. అవి వాడికి ఆయుఃక్షీణతనీ కలిగిస్తుంది. ఇప్పుడు చెప్పు వాడిని అందరిలా పొగిడి వాడి ఆయువును తగ్గించనా? లేక వాడిలో ఇంకా నిద్రాణమై ఉన్న ప్రతిభనీ వెలికి తీసేలా ప్రవర్తించనా! చెప్పు, తల్లిగా నువ్వు ఏం చెబితే అదే చేస్తాను. అర్థాంగిగా నువ్వు నన్ను ఆదేశించవచ్చు, అని ముగించాడు.

ఈ సంభాషణ అంతా అటకపైనున్న భారవి విన్నాడు.

అతడు ఒక్కసారిగా స్థాణువు అయ్యాడు. కంటికి ఎదురుగా ఏం ఉందో కనిపించనంతగా కళ్లలో నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. ఆకాశంపైన పడి పోతోందన్న భావన. తాను ఎంత తప్పుగా ఆలోచించాడు. తన మేధ ఏమై పోయింది. తాను అసలు క్షమార్హుడినేనా? క్షణంలో తేరుకున్న భారవి ఒక్కసారిగా అటక మీద నుంచి కిందికి దూకాడు. పరుగున వెళ్ళి తండ్రి కాళ్లపై పడ్డాడు. భోరున విలపించాడు. అతని కన్నీటితో తండ్రి పాదాలు మునిగి పోయాయి.

ఈ పరిణామానికి ఒక్కసారిగా నివ్వెర పోయారు. భారవి తల్లితండ్రులు. వారు ఊహించని పరిణామం అది. కొడుకు తమ మాటలు విన్నట్టు గ్రహించారు. భారవి తండ్రి కొడుకునీ ప్రేమగా లేవదీసాడు. లే.... నాయనా.... లే.. చింతించకు. కొడుకు తను చేసిన తప్పును క్షమించాలి. అయినా నువ్వు ఇప్పుడు ఏమి తప్పు చేశావని? నీ పరిధిలో నీ ఆలోచన సరైందే. కాకపోతే కొంచెం విచక్షణను

వినియోగించి ఉంటే నీకు విషయం బోధపడేది.

అప్పుడు భారవీ లేదు నాన్న... లేదు నా పాపానికి ప్రాయశ్చిత్తం లేదు. తండ్రి నే చంపాలని భావించిన పాపిని. ఈ ఘోర పాపానికి నిష్కృతి లేదు నాన్నా! మరణమే నా గతి!

అప్పుడు తండ్రి కాదు నాయనా! కాదు. "పశ్చాత్తాపాన్ని మించిన ప్రాయశ్చిత్తం లేదు. కనుక నువ్వు ఎలాంటి చెడు ఆలోచన పెట్టుకోకు. నువ్వు నా ప్రాణానివి కన్నా నువ్వ భవిష్యత్‌లో మంచి గ్రంధాలు రాస్తావు నీకు అన్నీ శుభాలే కలుగుతాయి." అని దీవించాడు.

ఇంతకీ ఆ కవి ఎవరో తెలుసా?.... "కిరాతార్జునీయం" కృతికర్త భారవి కవి. కాబట్టి డాడీ మెచ్చుకోలేదని భ్రమపడే పిల్లలు, పెద్దలు కూడా ఈ కథ నుంచి తెలుసుకునే నీతి ఉంది. డాడీ పొగడలేదని మూడీ అవద్దు. నాన్న ఉంటాడు నీ చెంత? మరెందుకు నీకు
చింత.

చివరిమాట ..."తండ్రికి, భవిష్యత్‌కి భయపడితే జీవితంలో పైకి రావడం కష్టం!"

-విజాపురపు వెంకటరావు